

ఆదివిష్ణు
సత్యంగారిల్లు

జీవిత భీమా వారి కార్యాలయం బందర్లో వున్న పెద్ద సైజు ఆఫీసుల్లో ఒకటి.

శాస్త్రి ఆ ఆఫీసుకి చేరుకున్నాడు.

గేటు దగ్గిరున్న వాచ్ మెన్‌తో మెల్లిగా మాట కలుపుకున్నాడు—

"నువ్వు నాకో సాయం చేయాలి తమ్ముడూ? మరేం లేదు– ఈ ఆఫీసుకి కొత్తగా బదిలీమీద వచ్చిన వాళ్లెవరైనా ఉన్నారా?"

అతనెందుకు అట్లా అడుగుతున్నాడో కనుక్కోకుండానే చెప్పేసేడు వాచ్ మెన్–

"ఎందుకుండరూ? బోలెడు మంది వుంటారు!"

శాస్త్రి ఆ మాటకిఆనందిస్తూఅన్నాడు–

"నా తండ్రే! చల్లటి కబురుచెప్పావు! నీకు తెలిసినంతవరకూ అలాంటి కేసు– ఒక్కటి– కనీసం ఒక్కటైనా చూపించగలవా?"

"గలనా అంటే గలను!" అన్నాడు వాచ్ మెన్ వరాలిచ్చే దేవుడి పోజులో.

శాస్త్రికి ఆరాటం పెరిగింది—

"ఏమిటో– ఈ దీనుడికి నువ్వే ఆశా కిరణంలాగా కనిపిస్తున్నావ్! ఎక్కడున్నారు నాయనా వారు?"

వాచ్ మెన్ డైరక్షన్లిస్తున్నాడు–

"అదుగో. అక్కడ కేంటీనుందా?"

"వుంది!"

"అందులో కాఫీ తాగుతున్నాడు!"

"ఆ మాటకొస్తే అక్కడ చాలామంది కాఫీలు తాగుతున్నారు నాయనా! వారిలో ఎవరు? అదిచెప్పు!" అన్నాడు శాస్త్రి ఆదుర్దాగా!

"ఆ గళ్ళచొక్కాని చూడు!" అన్నాడు వాచ్ మేన్ సీరియస్‌గా.

"చూసేను!" అన్నాడు శాస్త్రి ఆనందంగా.

"ఆ శాల్తీ నిన్నే వచ్చేడు!"

"ఏ ఊర్నుంచి వచ్చేడో?"

"అదేదో ఊరు చెప్పేడు. అక్కడ నీళ్ళు కూడా దొరకవట. దిక్కుమాలిన ఊరు. ఆ పేరు మరిచిపోయేను."

"అది నేచూసుకుంటాన్లే తండ్రీ! ఈ ఊళ్ళో ఎక్కడుంటున్నాడో చెప్పగలవా?"

వాచ్ మేన్ విసుక్కుంటూ అన్నాడు–

"నిన్నేగా వచ్చేడు. అంచేత ఆఫీసులోనే ఒక మూలపడివున్నాడు."

"పాపం! ఇల్లు దొరకలేదేమో?"

"దొరికితే ఆఫీసులో ఎందుకుంటాడు?"

"నా నాయనే! చాలామంచి విషయాలు చెప్పేవు ఇందా వుంచు." అని ఒకరూపాయి బిళ్ళ అతని చేతిలో వుంచేడు.

రూపాయి తీసుకున్నతర్వాత అడిగేడు వాచ్ మెన్–

"అవునూ! ఈ వివరాలన్నీ ఎందుకడిగేవ్?"

"ఏం చెప్పమంటావ్? ఆ జీవితోనే నా జీవితానికి రక్ష! అంతకంటే ఎక్కువ చెప్పలేను" అనేసి కేంటీన్‌వేపు నడిచేడు శాస్త్రి.

కేంటీన్లో గళ్ళచొక్కాని పట్టుకున్నాడు.

అతని కళ్ళల్లో కళ్లుపెట్టి గంభీరంగాఅడిగేడు–

"మీరు ఇక్కడికి కొత్తగా బదిలీఅయి వచ్చేరుగదూ?"

ముక్కూమొహం తెలీని మనిషెవరో అంత గంభీరంగా అడిగినందుకు గళ్ళచొక్కా వెంటనే దిక్కుమొహం పెట్టేసింది. నోటమాటరాక అవునన్నట్టు తలూపింది.

"మీ పేరేమిటన్నారు?" శాస్త్రి అడిగేడు.

"మాధవరావు" అన్నాడతను.

ఆ పేరు వినగానే శాస్త్రికళ్లుమూసుకుని వేళ్ళతో ఏవో గుణింతలు పూర్తిచేసి, కళ్ళు విప్పి అన్నాడు–

"అయిదు!"

"అంటే?" అర్థంగాక అడిగేడు మాధవరావు.


"మీయొక్క పేర్లో అక్షరాలు అయిదున్నాయి. 'మా'తో ప్రారంభమై 'ధ'తో నడిచి 'వ'ని కలుపుకుని 'రావు'తో పూర్తయింది. ఓహ్! దశగల పేరు. మొత్తం అయిదక్షరాలు!" అన్నాడు శాస్త్రి.

మాధవరావు మొహం వికసించింది.

శాస్త్రి అక్కడితో ఆగిపోలేదు–

"ఇంతకు పూర్వం మీరు పనిచేసిన ఊరు ఒక దిక్కుమాలిన దరిద్రగొట్టు ప్రదేశం! నీళ్లు కూడా దొరక్క పలు బాధలు పడ్డారు అవునా?"

శాస్త్రి చేస్తున్న మాజిక్కుకి మాధవరావు పూర్తిగా పడిపోయేడు. అడక్కుండానే తన జాతకం చెబుతున్న అతని ధోరణికి ఆకర్షితుడవుతున్నాడు. అంచేతనే అన్నాడు–



"చాలా కరెక్టుగా చెప్పేరు. ఆ ఊర్నుంచి ఈ ఊరుకి ట్రాన్స్ఫర్ కావడానికి అయిదేళ్ళ నుంచీ ప్రయత్నిస్తుంటే- ఇదుగో యిప్పటికి రాగలిగేను."

"అయిదేళ్ళ ప్రయత్నమా? ఓహ్! మళ్లా అయిదే! ఇక ఫర్లేదు. దశ తిరిగింది. ప్రమోషన్ కూడా యిచ్చి ఈ ఊళ్ళోనే వుంచుతారు."

"నిజంగానా? ముందు కాఫీ పుచ్చుకోండి చెబ్తాను" అన్నాడు మాధవరావు ఎంతో ఆనందంగా!

"వద్దు కాఫీలు, గీఫీలు తాగను" అని మళ్ళా కళ్ళు మూసుకుని వేళ్ళతో గుణింతాలు చేసి అన్నాడు శాస్త్రి-

"చూడండి మాధవరావుగారూ! మీరు ఇంకా ఇల్లదీ చూసుకోలేదనుకుంటాను."

"అవునండి. ఇవాళ చూద్దామనుకుంటున్నాను. ఇల్లు దొరగ్గానే ఫేమిలీ తెచ్చుకుంటాను."

"అలాగే చేయండి. కానీ ఒకటి!" అన్నాడు శాస్త్రి.

"చెప్పండి" ఆత్రంగా అడిగేడు మాధవరావు.

"ఇల్లంటూ తీసుకుంటే మీ ఆఫీసుకి తూర్పు దిక్కునవున్న ఇల్లే తీసుకోండి. కలిసొస్తుంది."

"ఈ ఊళ్ళో నాకు దిక్కులు తెలీవండి!" అన్నాడు మాధవరావు దిగులుగా.

"నే చెబ్తానుగదా! మీ ఆఫీసుకి గొడుగు పేట తూర్పుదిక్కునేవుంది."

"వుండచ్చనుకోండి. అక్కడ అద్దెకిచ్చే ఇల్లు దొరకాలిగదా!"

"దొరుకుతుంది. తుందేవిటి? దొరికింది! చక్కటి పోర్షను. గదులు ఐదు! ఓహ్.. మళ్ళా అయిదే! సెభాష్... ఏదీ ఒక్క ఏభై రూపాయలు అడ్వాన్సు యిప్పించండి. రిక్షా పిలిపించండి. ఇల్లు చూపెడతాను" అన్నాడు శాస్త్రి.



బుద్ధిలేదూ !

కోర్టులో విచారణ జరుగుతోంది.

"అతను కష్టపడి సంపాదించినది దొంగతనం చేయడానికిసిగ్గులేదూ?" అన్నాడు జడ్జి దొంగతో.

"నేను రాత్రి పన్నెండు నుండి రెండుగంటల వరకూ కష్టపడి దొంగతనం చేస్తే, విచారించడానికి మీకు బుద్ధిలేదూ?" అన్నాడాదొంగ.

—నగేష్. శ్రీను
విజయనగరం

ఆ మాటకి మాధవరావు చాలా సంతోషించేడు. మరోమాటచెప్పకుండా ఏభై రూపాయల నోటుతీసి శాస్త్రిచేతికిచ్చేడు.

శాస్త్రి తీసుకుంటూ అన్నాడు-

"ఈ ఏభై లోకూడ అయిదేవుంది. ఓహ్... చూడండిక మీరు వినేవన్నీ శుభవార్తలే!"

అని శాస్త్రి అంటుండగా కేంటీన్లోకి ఒక కుర్రగుమాస్తా పరుగెత్తుకుంటూ వచ్చేడు. మాధవరావుని చూస్తూ-

"గురూగారూ! మీకోవార్త!" అన్నాడు.

అతని ప్రకటనకి మాధవరావుతోపాటు శాస్త్రి కూడా ఆశ్చర్యపోయేడు. శాస్త్రి తన ఆశ్చర్యాన్ని కప్పిపెట్టుకుని చిద్విలాసంగానవ్వేస్తూ అన్నాడు-

"చూసేరా! వార్త అంటున్నాడు. వార్తలో కూడా అయిదే వుంటుంది!"

కుర్రగుమాస్తా విసుక్కుంటూ అన్నాడు-

"అయిదో పనో- ఆ లెక్కలు నాకు రావు గానీ- గురువుగారి ట్రాన్స్ఫర్ కేన్సిలైంది. ఎక్కడ్నించి వచ్చేరో అక్కడికే వెళ్ళమని ఆర్డర్స్ వచ్చేయి!"

అంతమాట వినగానే మాధవరావు నిలువుగుడ్లు వేసేడు. ఆ గుడ్లలో నీళ్ళు గిర్రున తిరిగేయి. ఆ నీళ్ళల్లో నీళ్ళుదొరకని దిక్కుమాలిన శ్రమ శాస్త్రికనిపించింది.

మాధవరావు దిగ్గునలేచేడు. శాస్త్రి చేతిలో వున్న ఏభైనోటు గబుక్కున లాక్కున్నాడు.

శాస్త్రి బిక్క మొహం పెట్టుకుని అన్నాడు-

"ఇచ్చింది లాక్కోకూడదు."

మాధవరావు వెర్రెత్తిపోయి శాస్త్రి మెడమీద చెయ్యివేసి అన్నాడు-

"విన్నావుగా శుభవార్త! ఇంకోక్షణం నా ముందున్నావంటే చెప్పుతోకొడతాను. అవుట్!"

ఆ వరసకి కేంటీన్లోఉన్న జనం ఏమిటేమిటని గుమిగూడుతున్నారు.

శాస్త్రికి భూమి బద్దలవుతున్నట్టుభ్రమకలిగింది.

## 18

కృష్ణమూర్తి తన భవిష్యత్ కార్యక్రమంపై కొన్నినిర్ణయాలు తీసుకున్నాడు.

మొట్టమొదట లక్ష్మీపతిగారిల్లు వెతకాలి. అవకాశం దొరికితే ఆయన్ను కలుసుకోవాలి. కలుసుకున్నతర్వాత ఆ మనిషి గుణగణాలు తెలుసుకోవాలి.

ఆ అధ్యాయం పూర్తయ్యేక ఆ మనిషిని ఆకర్షించుకునేవిధంగా తాను నడుచుకోవాలి. తద్వారా పద్మని పొందాలి.

టూకీగా రూపొందించుకున్న ఈకార్యక్రమంలో తొలిఅంశం ఇల్లు వెతుకుటగనుక అందుకు సిద్ధమయ్యేడు కృష్ణమూర్తి.

బాగా చల్లబడ్డతర్వాత హోటల్విడిచి రోడ్డు మీదికొచ్చేడు.

బందర్లో మెయిన్రోడ్లంటూ పదో పదహారో లేవు. ఒక్కటంటే ఒక్కటే రోడ్డుంది. అది ఆరేడుమైళ్ళ పొడుగుంటుంది.


సాయంత్రం పూట కాలక్షేపంకోసం వెతుక్కునే జనాభా ఆ రోడ్డెక్కితేచాలు ప్రపంచం చుట్టేసి నంత అనుభూతి కలుగుతుంది.

కృష్ణమూర్తి మెయిన్రోడ్డు విడిచి ఒక సందులో నడుస్తున్నాడు. ముందుగా ఇంగ్లీషు పాలెం ఎక్కడుందో కనుక్కోవాలి!

ఒక ఇంటిముందు గొడవేదో జరుగుతోంది

ఇంటి ఓనరుకాబోలు అరుస్తున్నాడు-

"నాఇంట్లో అద్దెకున్నవాళ్ళని లాక్కుపోడానికి నీకెన్నిగుండెలురా? ఏదీ తీసుకెళ్ళు చూస్తాను? లోలు వల్చేస్తాను. ఏమనుకుంటున్నావో?"



"పొరపాటు జరిగిపోయిందంటున్నానుగా! ఎందుకట్లా అరుస్తారు?" అంటున్నాడు శాస్త్రి.

అక్కడ శాస్త్రిని చూడగానే కృష్ణమూర్తి షాక్ తిన్నాడు. ఈ అద్దెల పిచ్చివాడు ఇక్కడి కెందుకు వచ్చినట్టు? ఏం పొరపాటు చేసినట్టు

ఇంటి ఓనరు శాస్త్రిమీదికి వస్తూ యింకా రంకెలు వేస్తున్నాడు-

"అరవడం కాదురా! నిన్నసలు కరవాలి! కొరికేసి మింగాలి! అమ్మో అమ్మో! నా ఇంటో దిగినవాడు ఆర్నెల్లలో దివాళాతీస్తాడా? ఏడాది లోగా టపాకడ్తాడా? మళ్ళాఅను ఆ మాట?"

ఆ ఇంట్లో అద్దెకున్న ఆసామికాబోలు సర్ది చెబుతున్నాడు-

"పోనిద్దురూ! పాడుగోల! కట్టుకథలు చెబితే ఖంగారుపడి మీయిల్లు ఖాళీచేసి అతను చూపించే ఇంటో చేరిపోతాననుకున్నాడు అమాయకుడు!"

ఇంటి ఓనరు రెచ్చిపోయి అంటున్నాడు-

"వీడు అమాయకుడు కాగండీ బాబు! కొంప తీసేరకం. తెలిసినవారుగనక వాడి ట్రిక్కు లన్నీ తోసిపారేసేరు. అదే కొత్తవాళ్ళయితేనా ఇంటికి ఎంతఅప్రతిష్ఠ? ఇంకాచూస్తూనిలబడ్డవేరా గాడిద! పో... ఇక్కడ్నించి!"

శాస్త్రి కళ్ళనీళ్ళు పెట్టుకుని కదిలేడు.

కృష్ణమూర్తికి శాస్త్రిమీద జాలి కలిగింది. పిలిచి ఓదార్చాలనుకున్నాడు. గానీ- లేనిపోని తద్దినం నాకెందుకని మవునం వహించేడు.

*     *     *

ఆ సాయంత్రం సరిగ్గా అయిదు గంటల ప్రాంతంలో కృష్ణమూర్తి లక్ష్మీపతి ఇల్లు కనుక్కోగలిగాడు.

ఇల్లు కనిపించగానే పద్మని చూడాలను కున్నాడు. అంచేత మెల్లిగా ఆ యింటి ఆవరణ లోకి అడుగు పెట్టాడు.

పూలమొక్కలకు నీళ్ళు పోస్తున్న వ్యక్తిని పలకరించే ఉద్దేశంతో చిన్న దగ్గు దగ్గేడు.

నీళ్లు పోసే వ్యక్తి ఆ శబ్దానికి తలెత్తి చూసేడు.

ఆ వ్యక్తి శాస్త్రి!

అద్దెల పిచ్చివాడు ఇక్కడ కూడా కనిపించే సరికి కృష్ణమూర్తికి మతిపోయినంత పనయింది. పారిపోదామనుకున్నాడు. కానీ- అంతలోనే శాస్త్రి ఎంతో మర్యాదగా పలకరించేడు-

"ఎవరు కావాలండీ?"

బహుశా శాస్త్రి తనని గుర్తుపట్టి ఉండడు. ఉంటే మళ్ళీ అద్దె భాగోతం చెరిగేసి ఉండేవాడు.

కృష్ణమూర్తి సంబాళించుకుని అడిగేడు-

"లక్ష్మీపతిగారిల్లిదే గదూ?"

## అందుకే ఇక్కడున్నా!

ఒకఇంట్లో అత్తాకోడళ్ళుకొట్లాడు తున్నారు. బయట జనం విచిత్రంగా చూస్తున్నారు.

"పాపం వాళ్లు అలా కొట్లాడు తున్నారు. వాళ్ళ అబ్బాయ్‌లేడా?" అడిగాడు ఒక పెద్దమనిషి రామా రావుతో.

"నేనే ఆ అబ్బాయ్‌ని. ఆఇంట్లో వున్నదిమాఅమ్మ నాభార్య. లోపలికి నేను వెళితే వాళ్ళు కొట్లాడంమానేసి నాతో కొట్లాడుతారు అందుకే బయట నుంచున్నా" అన్నడు రామారావు.

—హేమసుందర్ రావు
డోర్నకల్

శాస్త్రి అవునన్నట్టు తల ఊపుతూనే నెత్తిమీద చెయ్యి పెట్టుకుని ఆలోచనా ముద్రొకటి అభిన యించేడు.

ఆ భంగిమ చూడగానే కృష్ణమూర్తికి భయం వేసింది. తాను గుర్తుకువస్తే మళ్ళా అద్దెగోల వినిపిస్తాడేమోనన్న ఆందోళనతో అడగవలసిం దేదో అడిగేసేడు-

"వారు ఇంట్లో వున్నారా?"

శాస్త్రి ఆలోచిస్తూనే సమాధానం చెప్పేడు-

"లేరు. విజయవాడ వెళ్ళేరు."

"ఎప్పుడొస్తారు?"

"తెలీదు. ఎవరో గెస్టుని రిసీవ్ చేసుకోడానికి వెళ్ళేరు" అనేసి కృష్ణమూర్తి కళ్ళల్లోకి సూటిగా చూస్తున్నాడు.

అతని వరసకి భయపడ్డ కృష్ణమూర్తి అక్క డ్నించి వెళ్ళిపోదామనే ఉద్దేశంతో వెనక్కి తిరిగేడు.

"ఆగండి!" అన్నాడు శాస్త్రి.

కృష్ణమూర్తి ఆగిపోయేడు.

"మిమ్మల్ని ఎక్కడో చూసినట్టు గుర్తు!" అన్నాడు శాస్త్రి.

"చూసి ఉండొచ్చు!" అన్నాడు కృష్ణమూర్తి బెంగగా!

"అమ్మమ్మ! తమరా విధంగా తీసిపారేస్తే రాత్రి నిద్రపట్టక ఛస్తాను."

"అదేం పాపం?"

"అది నా జాతకం. ఏదైనా గుర్తుకురాకపోతే నిద్రపట్టదు. దయచేసి మీరైనా గుర్తుకు తెచ్చు కుని చెప్పండి. నన్నెక్కడైనా చూసేరా?"

ఈ జిడ్డు సంభాషణ కృష్ణమూర్తికి చిరాకు కలిగించింది. అంచేత నిజం చెప్పినా కసిగానే చెప్పేడు-

"చూసేను!"

"ఎక్కడ?"

"బస్టాండులో! అద్దెకో పోర్షనుందని నా ప్రాణాలు తీసేవు."

ఇప్పుడు శాస్త్రి మనసు కుదుటపడింది. అమ్మయ్య అనుకున్నాడు. ఆ తర్వాత యధా ప్రకారం తన డ్యూటీలో పడ్డాడు.

"చూసేరా! అప్పుడు అద్దెకు దిగనంటే దిగ నన్నారు. ఇప్పుడు వెతుక్కుంటూ వచ్చేరు. పదిలే యండి. రిక్షా పిలవండి. ఇల్లు చూపెడతాను."

కృష్ణమూర్తి కోపంగానే అనేసేడు-

"చూడు మిస్టర్! కనిపించిన ప్రతివాడూ అద్దె వేటలో ఉంటాడనుకోవడం పొరపాటు. ఒకవేళ నాకు నిజంగానే అద్దెకో పోర్షను కావల్సి వచ్చినా- నువ్వు చూపించే యింట్లో ఛస్తే దిగను. దిగను గాక దిగను. మైండిట్!"

—అని గట్టిగా వార్నింగిచ్చేసి వెళ్ళిపోతుండగా- ఆ గొడవకి పద్మ ఇంట్లోంచి బయటకు వచ్చింది- ఎవరదీ' అంటూ.

పద్మని చూడగానే కృష్ణమూర్తి కాళ్ళకి బ్రేకు పడింది. తక్కున ఆగిపోయేడు.

(ఇంకావుంది)

